## క్లుప్తంగా

### దేవదాయశాఖ ఈవోల బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన ప్రభాకరావు, నాగేశ్వరరావు

మందస: మందస కేంద్రంలోని దేవదాయ శాఖ పరిధిలో ఉన్న ఆలయాలకు కొత్తగా ఈవోలుగా నియమితులైన సీహెచ్ ప్రభాకరావు, ఎస్.నాగేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభాకరరావు జలుమూరు మండలం ముఖలింగంలోని ముఖలింగేశ్వ దేవస్థానం నుంచి, నాగేశ్వరరావు శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వర దేవస్థానం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. వీరు మందస మండలంలోని దేవదాయశాఖ పరిధిలో ఉన్న 20 దేవాలయలలో చేరో పది ఆలయాలకు ఈవోలుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా వ్యవహరించిన టి.వాసుదేవురావు పాతంపట్నంలో విధులు కొనసాగిస్తున్నారు.

### పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన



ఇంటింటా చెత్తను సేకరిస్తున్న దృశ్యం

పలాస: వానాకాలంలో రోగాలు బారిన పడే పరిస్థితులు తలెత్తుతాయని వాటినుంచి రక్షంచుకోవాలంటే మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పలాస ఎంపీడీవో కె.వసంతకుమార్ చెప్పారు. అల్లుకోల గ్రామంలో శనివారం పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇంటింటికి వచ్చే వాహనానికి అందజేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటా చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించారు. డిప్యూటీ ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు, పంచాయతీ సర్పంచ్ దువ్వాడ వామాక్షి, దువ్వాడ రవి, పంచాయతీ కార్యదర్శి సద్గుణరావు పాల్గొన్నారు.

### అగ్నిమాపక కేంద్ర భవనానికి భూమి పూజ




భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

సోంపేట: సోంపేటలో అగ్నిమాపక కేంద్రం నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే బి.అశోక్ శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. భవనం నిర్మాణం పూర్తయితే సిబ్బందికి మౌలిక వసతుల సమస్య తీరుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖాధికారి జె.మోహనరావు, సహాయాధికారి కె.శ్రీనుబాబు, ఎక్సైజ్ సీఐ జి.వి.రమణ, సోంపేట అగ్నిమాపక కేంద్రం అధికారి ఆర్.సూర్యారావు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

### ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

టెక్కలి: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి వ్యాస రచన పోటీల్లో టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ మేరకు శనివారం జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ చేతుల మీదుగా విజేతలు ఎం.లీక్షిత, వి.వీరభద్ర, జ్ఞానేశ్వరి తదితరులకు బహుమతులు అందజేశారు. అఖిల భారత విద్యార్థి సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు సాయికృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, కళాశాల శాక్ ఇన్‌చార్జి సురేష్‌కుమార్, డీన్ ఆర్.శాంతికుమార్ పాల్గొన్నారు.

### మోసం గ్యారెంటీ సభా ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సాయిరాజ్, నాయకులు

కవిటి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆదివారం కవిటిలో నిర్వహించనున్న బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ నియోజకవర్గస్థాయి సభా ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ శనివారం పరిశీలించారు. మండల పార్టీ కన్వీనర్ కడియాల ప్రకాష్, జేసీఎస్ కన్వీనర్ జల్లు యుగంధర్‌తో కలిసి సభ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సభకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా కవిటి అగ్నికులక్షత్రియసంఘం భవనంలో ఉదయం తొమ్మిది గంటలకు సభ నిర్వహణకు చర్యలు తీసుకున్నారు. పరిశీలనలో పార్టీ నేతలు కె.ప్రకాష్, జె.యుగంధర్, వైస్ ఎంపీపీలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, పూడి నీలాచలం, మురపాల లచ్చయ్య, చందాన పూర్ణచంద్ర, దుద్ది ధర్మారావు, వై.నీలయ్య, రాంబాబు పాల్గొన్నారు.

# అటకెక్కిన పశువైద్యం!

- పది వైద్య శాలలకు ఇద్దరే వైద్యులు
- తెరుచుకోని పశువైద్య కేంద్రాలు

ఇచ్ఛాపురం రూరల్:

కూటమి ప్రభుత్వ హయాంలో పశువైద్యం సైతం పడకేసింది. మూగజీవాలకు అనారోగ్యమైతే చికిత్స చేసేందుకు డాక్టర్లు లేకుండాపోయారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా వర్షాకాలం ఆరంభంలో గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసి జబ్బవాపు, గుండెవాపు, లంప్‌స్కిన్, బ్రూసెల్లోసెస్, గొర్రెలకు చిటుక్కురోగం, నట్టల నివారణ మందులను పంపిణీ చేసేవారు. ప్రస్తుతం ఆరు నెలలుగా ఆస్పత్రులకు మందులు సరఫరా లేకపోవడంతో పశు వైద్యం అటకెక్కింది.

**ఆస్పత్రులు ఉన్నా.. వైద్యులే లేరు..**

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఈదుపురం, కొళిగాం, కవిటి, బొరివంక, మఖరాంపురం, కంచిలి, ఎం.ఎస్.పల్లి, బారువ, బేసి రామచంద్రాపురం, మామిడిపల్లి గ్రామాల్లో పది ప్రాథమిక పశు వైద్య కేంద్రాలు ఉండగా.. వీటి పరిధిలో ఇద్దరు పశువైద్యాధికారులే ఉన్నారు. డొంకూరు, బి.తోటూరు, శిలగాం, రాజపురం, జె.భైరిపురం గ్రామాల్లో ఐదు పశు వైద్య ఉప కేంద్రాలు ఉండగా ముగ్గురు వెటర్న రీ లైవ్‌స్టాక్ ఆఫీసర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఇచ్ఛాపురం, సోంపేటలో ఏడీ పశువైద్యశాలలు ఉండగా, ఇచ్ఛాపురం ఏడీ పోస్టు ఖాళీగా ఉండగా సోంపేటలో ఏడీగా డాక్టర్ కె.అప్పలస్వామి పనిచేస్తున్నారు.

**జిల్లా వ్యక్తే మంత్రి అయినప్పటికీ..**

జిల్లాకు చెందిన కె.అచ్చెంనాయుడు రాష్ట్ర పశు వైద్యశాఖామంత్రి అయినప్పటికీ పశువులకు వైద్యం మాత్రం అందని పరిస్థితి. సిబ్బందిలేమి వెంటాడుతోంది. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పది పశువైద్యశాలలు ఉండగా కేవలం ఇద్దరు వైద్యులు మాత్రమే సేవలు అందిస్తున్నారు. ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో పనిచేసిన లవ్‌కుమార్ అల్లూరీ సీతారామరాజు జిల్లాకు, కొళిగాంలో పనిచేసిన గుసిరి కిరణ్‌కుమార్ గుంటూరు బదిలీపై వెళ్లిపోయారు. దీంతో సోంపేట మండలం బేసి రామచంద్రాపురంలో పనిచేస్తున్న బిడ్డిక శిరీష ఇచ్ఛాపురం మండలంలో ఇన్‌చార్జితో పాటు సోంపేట మండలంలో ఖాళీగా ఉన్న బారువ, మామిడిపల్లి పశు వైద్య కేంద్రాల్లో ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. కంచిలి మండలం మఖరాంపురంలో పనిచేస్తున్న టి.శిరీష కవిటి మండలం కవిటి, బొరివంక, కంచిలి మండలం ఎం.ఎస్.పల్లి, కంచిలి ఆస్పత్రులకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. వైద్య లు, సిబ్బంది లేకపోవడంతో ఆస్పత్రుల తలుపులు తెరుచుకోవడం లేదు.

| నియోజకవర్గంలో పశు సంపద ఇలా.. | |
|---|---|
| ఆవులు | 45,880 |
| గేదెలు | 25,422 |
| మేకలు | 15,723 |
| గొర్రెలు | 73,227 |



తలుపులు తెరుచుకోని ఇచ్ఛాపురం ఏడీ పశువైద్య కేంద్రం



వైద్యం అందక మృత్యువాత పడిన గొర్రెవద్ద కాపరి



వైద్యులు లేకపోవడంతో మూతపడిన కొళగాం పశువైద్య కేంద్రం

**పశువైద్యం అందడం లేదు**



నాకు 150కు పైగా గొర్రెలు ఉన్నాయి. గతంలో మా గ్రామంలో పశువైద్యం అందేది. ఇప్పుడు పూర్తిగా ఆస్పత్రి తెరుచుకోవడం లేదు. గొర్రెలకు ఏమైనా రోగాలు వస్తే మందుల కోసం ప్రైవేటు దుకాణాల్లో తెచ్చుకొని మేమే వేస్తున్నాం. పశువైద్యాధికారి లేరు. గతంలో 1962 అంబులెన్స్ వాహనం వచ్చేది. ఇప్పుడు ఆ వాహనం కూడా రావడం లేదు.

– దట్టి జగ్గారావు, గొర్రెల కాపరి, ఈదుపురం

**ఇన్‌చార్జిలతో విధులు**



నియోజకవర్గంలో పది పశువైద్యశాలు ఉండగా, సోంపేట, కంచిలి మండలాల్లో ఇద్దరు వైద్యులు ఉన్నారు. చేరో ఒకర్ని కవిటి, ఇచ్ఛాపురం మండలాలకు ఇన్‌చార్జిలుగా విధులు అప్పగించాం. ఇచ్ఛాపురంలో ఏడీ పోస్టు ఖాళీగా ఇండటంతో నేను ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నాను. ఈ ఏడాది జనవరి నెలలో మందులు వచ్చాయి. కొత్తగా వైద్యులు వచ్చే వరకు ఇబ్బంది తప్పదు.

– డాక్టర్. కె.అప్పలస్వామి, ఏడీ, సోంపేట

### ఉపాధ్యాయులకు సత్కారం



పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ప్రగతి కోసం నిరంతరం శ్రమించిన ఉపాధ్యాయులు అభినందనీయులని నగరంపల్లి సర్పంచ్ డి.మధుకేశవరావు అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తూ ఇటీవల వేర్వేరు పాఠశాలలకు బదిలీపై వెళ్లిన కేశవరావు, ప్రసాద్, చంద్రశేఖర్, సూర్యనారాయణ, మోహనరావు, సురేష్, రమణమ్మ, సీతారామ్మూర్తి, శ్రీదేవి, సంతోష్‌లను శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికలను అందజేసి అభినందించారు. హెచ్‌ఎం టి.రామరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బి.లక్ష్మీపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

–వజ్రపుకొత్తూరు

### మహిళల భద్రతకు ప్రాధాన్యం



మహిళల భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని కాశీబుగ్గ సబ్‌డివిజన్ శక్తి టీం సబ్ ఇన్‌స్పెక్టర్ రవి, కంచిలి సబ్ ఇన్‌స్పెక్టర్ పి.పారినాయుడు అన్నారు. కంచిలిలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో శక్తి యాప్ వినియోగంపై శనివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాలు ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఆకతాయిలు విద్యార్థినులను వేధిస్తే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఉరిటి జగదీష్ కుమార్, లైబ్రేరియన్ కె.సి.హెచ్.పట్నాయక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.కె.దాస్, అధ్యాపకులు వాసుదేవరావు, వేణుగోపాల్, తిరుపతిరావు, మురళీక్రిష్ణ, కోదండరావు పాల్గొన్నారు.

–కంచిలి

## బాబూ ష్యూరిటీ-మోసం గ్యారెంటీ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తిలక్, నాయకులు

టెక్కలి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై వైఎస్సార్‌సీపీ తలపెట్టిన బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంపై ప్రజలకు చైతన్యం కల్పించాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ కోరారు. శనివారం టెక్కలి పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమక్షంలో బాబూ ష్యూరిటీ...మోసం గ్యారెంటీ క్యూ ఆర్ కోడ్ కలిగిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల మనుపు ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోవడంపై ప్రజలు నిలదీసే విధంగా గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇటీవల అమలు చేసిన తల్లికి వందనం పథకంలో భారీగా చేసిన మోసాన్ని వివరించాలన్నారు. యువగళం కార్యక్రమం ద్వారా నిరుద్యోగ యువతకు లోకేష్ ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని నిలదీయాలన్నారు. ఈ నెల 13 నుంచి గ్రామాల్లో బాబూ ష్యూరిటీ... మోసం గ్యారెంటీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలన్నారు. 12వ తేదీన టెక్కలి ఆదిత్య కళ్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తిలక్ కోరారు. 8న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాల్లో భాగంగా ఆయన విగ్రహాలను శుభ్రపరచి ఘనంగా జయంతి నిర్వహించాలన్నారు. అలాగే టెక్కలిలో నిర్వహించనున్న జయంతి కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ హెచ్.వెంకటేశ్వరావు, పట్టణ అధ్యక్షుడు టి.కిరణ్, నాయకులు ఎస్.సత్యం, వి.శ్రీధర్‌రెడ్డి, కె.అజయ్, ఎస్.బాలకృష్ణ, డి.పోలయ్య, ఎం.శంకర్, వి.తవిటయ్య, పి.రమణబాబు, కె.జీవన్, బి.కార్తీక్, పి.మోహన్‌రావు, ఆర్.మురళీరెడ్డి, కె.కామేష్, బి.రాజేష్, డి.కామన్న, బి.ఉదయ్, యు.తమ్మయ్య, చంద్రయ్య, పి.అప్పలనాయుడు, డి.మదీన్, బి.రాకేష్, జె.తిరుమలరెడ్డి, ఎం.కృష్ణ, డి.శ్రీను, పి.శ్రీనివాస్, ఎస్.అప్పలస్వామి పాల్గొన్నారు.

## విత్తన క్షేత్రాల్లో చిరుధాన్యాలు ఉత్పత్తి



మాట్లాడుతున్న డీపీఎం సత్యనారాయణ

వజ్రపుకొత్తూరు: విత్తన క్షేత్రాలు చిరు ధాన్యాలు సాగు చేసి వాటిని మళ్లీ రైతులకు విత్తనాలుగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకృతి వ్యవసాయ జిల్లా డీపీఎం పూజారి సత్యనారాయణ అన్నారు. లింగాలపాడు, పాతటెక్కలి గ్రామాల్లో జీడి, కొబ్బరి తోటల్లో నవధాన్యాలు సాగు(సీడ్ ప్లాట్స్) కోసం తొమ్మిది రకాల విత్తనాలతో వరుస క్రమంలో విత్తడంపై రెండో రోజైన శనివారం రైతులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. విత్తనాలు నాటడం, యాజమాన్య పద్ధతులను వివరించారు. మార్కెట్‌లో చిరు ధాన్యాలకు డిమాండ్ ఉందని దీనిని ప్రతీ గ్రామంలో సాగు చేసేందుకు రైతులను సమాయత్తం చేస్తున్నామని అన్నారు. దీనివల్ల విత్తనాలు మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేసేందుకు అవకాశం ఉండదన్నారు. కార్యక్రమంలో ఎంఏవో బమ్మిడి ధనుంజయరావు, వీహెచ్ఏ ప్రవీణ, ఎస్ఎఫ్ఏలు గోవిందరెడ్డి, శివాజీ, ఎంటీ సూర్యనారాయణ, డీఎంఎంటీ, ఎస్.ధనుంజయరావు, ఐసీఆర్పీలు సీహెచ్ సంగీత, సరస్వతి, పుష్ప పాల్గొన్నారు.

### రీసర్వే గ్రామాలపై సమీక్ష



మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌కుమార్

కంచిలి: మండలంలోని ముండ్ల, బొనమాళి గ్రామాల్లో చేపడుతున్న రీ సర్వే పరిస్థితిపై తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ సమీక్షించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలోని తన చాంబర్‌లో సిబ్బందింతో రీ సర్వే అంశంపై శనివారం నిర్వహించిన సమావేశంలో చర్చించారు. రీ సర్వే ప్రస్తుత స్థితి, జాయింట్ ఎల్‌పీఎంలు, ఎఫ్.లైన్ పిటిషన్లు, ఇతర సర్వ సంబంధిత పనులపై ఆరా తీశారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ డి.సంతోష్, మండల, గ్రామీణ సర్వేయర్లు పాల్గొన్నారు.

### వాహన సామర్థ్య తనిఖీ ఇచ్ఛాపురంలో జరిపించాలని వినతి

ఇచ్ఛాపురం టౌన్: వాహనాల సామర్థ్యం తనిఖీ (వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్) ఇచ్ఛాపురంలో జరిపించాలని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి కోరారు. ఈ మేరకు రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హాను విజయవాడలోని తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేసినట్టు శనివారం తెలిపారు. చాలా సంవత్సరాలుగా ఇచ్ఛాపురంలో ఉన్న వాహనాల సామర్థ్యం తనిఖీ కేంద్రాన్ని ఇటీవల సుమారు 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎచ్చెర్లకు తరలించడంతో ఈ ప్రాంతీయులు ఇబ్బంది పడుతున్నట్టు కమిషనర్‌కు వివరించినట్టు పేర్కొన్నారు. ఆటో 60 కిలోమీటర్ల వరకు మాత్రమే ప్రయాణానికి అనుమతులు ఉన్నందున ఈ తనిఖీ కోసం వెళ్లే సందర్భంలో ప్రమాదాలు జరిగితే బీమా సౌకర్యంలో కూడా సమస్యలు తలెత్తుతాయన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో తిరుమలరావు

కంచిలి: సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని మండలాభివృద్ధి అధికారి వి.తిరుమలరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం వైద్యారోగ్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, పంచాయతీ కార్యదర్శులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున వైద్యులు, సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా, డయేరియా తదితర వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో కంచిలి, ఎం.ఎస్.పల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ టి.హరిబాబు, ఎస్.నాగేంద్ర, సుస్మితారెడ్డి, మలేరియా నివారణాధికారి ఎస్.లక్ష్మీనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎం.మోహనరావు, ఈవోపీఆర్డీ రాంబాబు పాల్గొన్నారు.

## విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలి



కాశీబుగ్గలో నిరసన తెలియజేస్తున్న సీపీఐ నాయకులు

కాశీబుగ్గ: విద్యుత్ చార్జీలు భారం తగ్గించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి పిలుపుమేరకు శనివారం కాశీబుగ్గ బస్టాండ్ వద్ద గాంధీ విగ్రహం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.యుగంధర్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు మాట్లాడుతూ.. ప్రజలపై ఎటువంటి భారాలు వేయమని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీల భారాన్ని మోపిన్నారు. అంతేకాకుండా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని చెప్పిన కూటమి ప్రభుత్వం ప్రస్తుతం స్మార్ట్ మీటర్లను అమర్చడం దారుణమన్నారు. సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేసిన టీడీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం దాన్ని అమలు చేసేలా వ్యవహరిస్తోందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరొక మాట సరికాదని అన్నారు. నాయకులు గోరు వాసుదేవరావు, సాయి, హరి, వాసు, వెంకట్రావు, కృష్ణ, జయరాం పాల్గొన్నారు.

### 8న టెక్కలిలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

టెక్కలి: టెక్కలిలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్)ను ఈ నెల ఎనిమిదో తేదీన నిర్వహిస్తున్నట్లు ఈఈ జి.శంకరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. టెక్కలి ఎన్టీఆర్ కాలనీ సమీపంలోని ఎస్-కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమం ద్వారా డివిజన్ పరిధిలో వినియోగదారులు వారి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

## కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం



మాట్లాడుతున్న మాజీ మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఏడాది పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్దామని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాసలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల రెండో తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు ప్రగతిభవన్ ప్రాంగణంలో నిర్వహించనున్న విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఏడాది పాలన వైఫల్యాలతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఎగ్గొట్టిన వైనం, పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా సాగుతున్న కుట్రలు, దాడులపై, సూపర్‌సిక్స్ హామీలు ఎగ్గొట్టిన తీరును ప్రజల్లోకి బలంగా తీసుకుపోవాలన్నారు. మూడు మండలాలు, మున్సిపాలిటీ ముఖ్యనాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు సభ్యులు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో 74 కేసులు పరిష్కారం



సోంపేట: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయవాదులు

సోంపేట: సోంపేట కోర్టుల సముదాయంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 74 కేసులు పరిష్కారమైనట్టు సీనియర్ సివిల్ న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు తెలిపారు. కోర్టుల ఆవరణలో రెండు బెంచీలు ఏర్పాటు చేసి అదాలత్ నిర్వహించారు. సీనియర్ సివిల్ న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు ఒకటవ బెంచి, జూనియర్ సివిల్ న్యాయమూర్తి కె.శ్రీనువాసరావు రెండవ బెంచిలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించి జాతీయ లోక్‌అదాలత్ వలన ప్రయోజనాలు వివరించారు. లోక్‌అదాలత్‌తో ఇరువర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. న్యాయవాదులు ఎస్.విజయ్‌కుమార్, ఎన్.జోగారావు, జి.శైలేంద్ర పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురంలో 139 కేసులు..**

ఇచ్ఛాపురం: స్థానిక జూనియర్ సివిల్ జడ్జికోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 139 కేసులు పరిష్కరించినట్టు జూనియర్ సివిల్ జడ్జి పి.పరేష్‌కుమార్ తెలిపారు. వీటిలో ఒక విడాకుల కేసు, నాలుగు సివిల్ కేసులు, ఆరు ఎక్సైజ్ కేసులు, 27 రాజీపడదగ్గ కేసులు, 101 ఎస్టీసీ కేసులను పరిష్కరించారు. ఈ కేసుల ద్వారా అపరాధ రుసుముగా రూ. 11,350 వసూలైనట్లు పేర్కొన్నారు. అలాగే మనోవర్తి కేసులో అపరాధ రుసుంగా రూ. 5.20 లక్షలు అందజేశారు. సీఐ మీసాల చిన్నంనాయుడు, ఎస్సైలు ముకుందరావు, శ్రీనివాసరావు, బార్‌అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు

**పలాసలో 102 కేసులు..**

కాశీబుగ్గ: పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 102 కేసులు పరిష్కారమైనట్టు జడ్జి యు.మాధురి తెలిపారు. వీటిలో 98 క్రిమినల్, నాలుగు సివిల్ కేసులు ఉన్నాయి. అలాగే నేరం అంగీకరించినందున 146 అడ్మిషన్లతో పాటు డ్రంక్‌అండ్ డ్రైవ్లో రూ.10వే లు చొప్పున, పబ్లిక్‌గా మద్యం సేవించిన వారికి వెయ్యి రూపాయల అపరాధ రుసుం విధించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఫయాద్ అహ్మద్, ఉపాధ్యక్షులు బీకేఆర్ పటా్నయక్, జాయింట్ సెక్రటరీ జీఎంఎస్ అనీల్‌రాజు, లోక్‌అదాలత్ మెంబర్ గురిబెల్లి ప్రభాకర్, రవికుమార్, చంద్రశేఖర్, రాజరత్నం నాయడు, తాండ్ర మురళి, పిండి వెంకటరావు, ఏపీపీ రమేష్, కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ ఉన్నారు.

## సంక్షిప్తంగా...

**'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' సభకు తరలిరండి**



కవిటి: బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ రెండవ దశలో ఆదివారం కవిటిలో నిర్వహిస్తున్న నియోజకవర్గస్థాయి సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు శనివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, నాలుగు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ప్రతినిధులు, పార్టీ ముఖ్యనేతలు, క్రియాశీల కార్యకర్తలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

**నేడు ఉచితంగా రేబిస్ నిరోధక టీకాలు**

టెక్కలి: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా టెక్కలి చిన్నబజారులోని పశు సంవర్ధక శాఖ ఆస్పత్రిలో శనివారం ఉచితంగా రేబిస్ టీకాలు వేయనున్నట్లు ఏడీ బి.వెంకటరమణ శనివారం తెలిపారు. పెంపుడు కుక్కలు ఉన్న వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**నాలుగు ద్విచక్ర వాహనాలు సీజ్**

సోంపేట: బెంకిలి, జింకిభద్ర గ్రామ పంచాయతీల పరిధిలో శనివారం సోంపేట ఎస్సై వి.లోవరాజు సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పత్రాలు లేని నాలుగు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని అన్నారు.

**పశుదాణా పంపిణీ**

వజ్రపుకొత్తూరు: గోవిందపురం పశువైద్య కేంద్రం వద్ద శనివారం పాడి రైతులకు సబ్సిడీపై పశువుల దాణాను పంపిణీ చేశారు. 45 బస్తాల దాణా వచ్చిందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని గోవిందపురం పశువైద్యాధికారి కె.మధుబాబు సూచించారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పి.ఈశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్ని రమణ, మోహనరావు పాల్గొన్నారు.

**వైద్యం కోసం ఆర్థిక సాయం**

వజ్రపుకొత్తూరు: పూడిజగన్నాథపురం గ్రామానికి చెందిన దుమ్ము ఏకాంబరం రైలు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక హ్యాండ్స్ టుగెదర్ ట్రస్ట్ ప్రతినిధులు అండగా నిలిచారు. రూ. 25,700 సేకరించారు. ఈ మొత్తాన్ని బాధితుడికి శనివారం అందజేశారు. కాగా ఇప్పటికే ఆ సంస్థ ప్రతినిధులు రూ.1.50 లక్షలు సాయాన్ని అందించి ఉన్నారు. హ్యాండ్స్ టుగెదర్ ట్రస్ట్ ప్రతినిధులు ఆదినారాయణ, కోదండరావు, గణపతి, సింహాచలం ఉన్నారు.

**అలరించిన సంగీత కచేరి**

సోంపేట: జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా సోంపేట పట్టణంలోని కోదండరామస్వామి దేవాలయం ఆవరణలో శనివారం నిర్వహించిన సంగీత కచేరి శ్రోతలను ఆకట్టుకుంది. వారణాశి బెనారస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బొంతలకోటి వర ప్రసాద్, తెలుకుల గోవింద్, లోళ్ల రాంబాబు పలువురు కళాకారులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు కళాకారులను సన్మానించారు.

**ఎంసీఏ విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత**



సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం ఎంసీఏ విద్యార్థులకు గ్లోబల్ సర్టిఫికేషన్ ఆన్ ఏజెంట్ ఫోర్స్ స్పెషలిస్ట్ క్యాంపస్ కార్పొరేట్ సంస్థ ఆధ్వర్యంలో సేల్స్ ఫోర్స్ గ్లోబల్ సర్టిఫికెట్లు అందజేసినట్లు డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ మేరకు ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న కళాశాలకు చెందిన 61 మంది విద్యార్థులకు సంస్థ రిసోర్స్ పర్సన్ ఆర్.వి.శివప్రసాద్ నేతృత్వంలో సర్టిఫికెట్లు అందజేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాకులు శ్రీకాంత్, టి.నరేష్ పాల్గొన్నారు.

**పంటల బీమాను సద్వినియోగం చేసుకోండి**

నందిగాం: ప్రకృతి వైపరీత్యాలతో పంటలను నష్టపోతే ఆర్థికంగా రైతు నష్టపోకుండా పంటల బీమా పథకం అండగా ఉంటుందని టెక్కలి వ్యవసాయశాఖ ఏడీ కె.జగన్మోహనరావు అన్నారు. రైతులు విధిగా పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నందిగాం రైతు సేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని శనివారం ఏఓ శ్రీకాంత్‌వర్మ నిర్వహించారు.